క్లుప్తంగా

ఘనంగా దేవి శాంతి హోమం



పామర్రు: స్థానిక శ్రీ అంకమ్మతల్లి ఆలయంలో మంగళవారం భాద్రపద మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామికి అన్నాభిషేకం, నవగ్రహ దేవీ హోమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజలను అర్చకులు హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన



పమిడిముక్కల: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కానూరులో శిక్షణ పొందుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 30 మంది డీఈఈలు మండలంలోని గోపువానిపాలెంలో మంగళవారం పర్యటించారు. గోపువానిపాలెంలో తాగునీటి సరఫరాకు సంబంధించిన వాటర్ ట్యాంక్, పైప్‌లైన్, పబ్లిక్ కుళాయిలు, బోర్‌వెల్స్‌ను పరిశీలించారు. నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ యార్లగడ్డ నాగభూషణం, ఏఈ ప్రసాద్, ఎంపీడీఓ సీతారామరాజు, డెప్యూటీ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలి



పామర్రు: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపై కూడా ఆసక్తి చూపి ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, షెటిల్, చెస్ తదితర పోటీలను నిర్వహించారు. నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ జి.మురళి, వ్యాయామ ఉపాధ్యాయులు రవి కిషోర్, జవహర్‌బాబు, చంద్రశేఖర్, నందకిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పమిడిముక్కల: విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకొని కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోవాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. మండలంలోని తాడంకి జెడ్పీ పాఠశాల్లో పీఎంశ్రీ నిధులు రూ.15.58 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను మంగళవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను సక్రమ రీతిలో వినియోగించుకోవాలన్నారు. హైస్కూల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఓజోన్ డేను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్, మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరంకి రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



గుడివాడ రణభేరిలో ప్రసంగిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

గుడివాడ టౌన్: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ నాయకులు విమర్శించారు. ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్, ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు తలపెట్టిన రణభేరి విజయవంతంగా కొనసాగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గన్నవరంలో ఈ రణభేరి ప్రారంభమైందని తెలిపారు. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రుల మీదుగా గుడివాడ చేరుకుని స్థానిక ఏజీకే హైస్కూల్లో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విధానంలో యాప్‌ల భారం ఎక్కువైనందున పాఠశాల్లో మొబైల్ వినియోగ అవకాశాలు కల్పించాలన్నారు. బకాయి ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఉమా మహేశ్వరరావు, ఎస్పీ మనోకుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు లెనిన్‌బాబు, నీలం ప్రభాకరరావు, కోశాధికారి ఎం. వరప్రసాదు, జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25న విజయవాడలో బహిరంగ సభ

గుడ్లవల్లేరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆర్థిక విద్యారంగ సమస్యలపై చేపట్టిన రణభేరి బైక్ ర్యాలీ గుడ్లవల్లేరు మండలానికి మంగళవారం సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు ఈ నెల 25వ తేదీన విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డి.వి.ఎం.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.వెంకట్రావు, గౌరవాధ్యక్షురాలు ఎం.ఆరోగ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ వరలక్ష్మి, జిల్లా కోశాధికారి పరుచూరి ధనశ్రీ, మండల కన్వీనర్ చందన లక్ష్మి, రమాదేవి, జయలక్ష్మి, ఆంజనేయులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా యూటీఎఫ్ నాయకుల నిరసన

ఓజోన్ పొరను కాపాడటం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత



మొవ్వలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కైకలూరు: పర్యావరణ పరిరక్షణలో గొడుగుగా పేరొందిన ఓజోన్ పొరను కాడాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత పేర్కొన్నారు. వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా రసాయన శాస్త్రం, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో నేషనల్ వర్క్‌షాప్ మంగళవారం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొరలో రంధ్రాలు ఏర్పడటంతో అనేక చర్మ సంబంధ వ్యాధులు ప్రబలుతాయన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఓజోన్ పొర, ప్రాముఖ్యత, దాని పరిరక్షణ బాధ్యతలను వివరించారు. ఆన్‌లైన్ ద్వారా ముగింపు సభలో ఐఐటీ, గౌహతి ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ పాము మాట్లాడారు. ఓజోన్ సంరక్షణలో ప్రజలందరూ అంతర్జాతీయ మాంట్రియల్ ప్రోటోకాల్, వియన్నాలో తీసుకొన్న మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్థులకు ఇ–క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్లలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.కే దారి, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.సంధ్య, అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు, బట్టు వేదాంతం, డాక్టర్ ఎం.హరిప్రసాద్, డాక్టర్ ఎం.విజయకుమార్, డాక్టర్ ఆర్.జాలాబాబు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్లో, వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో మంగళవారం ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేశారు. అలాగే స్వచ్ఛ పక్వడా కార్యక్రమంలో భాగంగా పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల హెచ్‌ఎం నిమ్మగడ్డ ఉమాశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో స్టేడియం క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

గుడివాడ టౌన్: అండర్–20 ఓపెన్ చెస్ పోటీల్లో తమ క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విజేతలైన క్రీడాకారులను స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన త్రివేణి పబ్లిక్ స్కూల్లో జరిగిన అండర్–20 చెస్ పోటీల్లో వివిధ విభాగాల్లో తమ క్రీడాకారులు ఎ. తిరానంద్, బి ప్రవల్లిక, ఎం. దేవాన్ష్ శ్రీరెడ్డి, వెంకట సుజిత్ జోగి, ఎం. పూర్వాన్స్ నాగ సాయిలు మొదటి బహుమతి సాధించారన్నారు. బి. నందకిషోర్, ఎస్. కుందనప్రియ, షేక్ తౌఫిక, ఆద్యారాయ్ ద్వితీయ బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేడియం సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మండవల్లి: మండవల్లి పంచాయతీ పరిధిలోని కైకలూరు వీధిలో సర్పంచ్ మెండా ఝాన్సీ మంగళవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని, ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు చేయించి, ప్రజలకు ఎలాటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



మండవల్లి: మండలంలోని నీలగిరి పట్నం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–1 సీహెచ్ సురేష్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల ప్రగతిని స్వయంగా పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శిరీష పాల్గొన్నారు.

బ్యాంకర్ల బెదిరింపులు ఆపాలి



ధర్నా చేస్తున్న టిడ్కో కాలనీ మహిళలు

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీలో లబ్ధిదారులు రుణాలు చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులు చేస్తున్న వత్తిళ్లను ఆపాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు రాణి డిమాండ్ చేశారు. కాలనీలో మహిళలు మంగళవారం ధర్నా చేశారు. బ్యాంక్ అధికారులు సి, బి బ్లాకుల్లోకి వెళ్లి తాళాలు వేస్తామని బెదిరింపులకు దిగారని ఆరోపించారు. ఎన్నికల ముందు తాము గెలిస్తే ఏ ఒక్కరూ బ్యాంక్ రుణాలు చెల్లించాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు ఇప్పుడు బ్యాంక్ అధికారులు తాళాలు వేస్తున్నా, బెదిరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ, ఉపాధ్యక్షుడు ఆర్. శివరామ్ ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్‌కు చర్యలు



పంపుల చెరువు గండి పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: ఖాళీ ప్రదేశాలలో చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని 25వ వార్డు పెద ఎరికపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు తాను సమస్యలు తెలుసుకునేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్మశాన వాటిక ప్రాంగణంలో పూర్తిగా చెట్లు మొలిచిపోయాయని వాటిని తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం పంపుల చెరువుకు గతంలో పడిన గండి పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎలుకల నివారణతోనే పంటకు రక్షణ



ఎలుకల మందు తయారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

ముదినేపల్లి రూరల్: వరిసాగులో ఎలుకల నివారణతోనే దిగుబడులు సాధించవచ్చని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. మండలంలోని వాడవల్లి, వణుదుర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరిసాగులో ఎలుకల బెడద వల్ల రైతులకు అపారనష్టం వాటిల్లుతోందన్నారు. దీనికి సామూహిక ఎలుకల నిర్మూలనే ఏకైక పరిష్కారమన్నారు. మండలంలోని వరి చేలకు మరికొద్దిరోజుల్లో చిరుపొట్ట, కుదురు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ఎలుకల బెడద తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా రైతులకు నూరు శాతం సబ్సిడీతో అందించే గ్రోమోడయోలిన్ మందును ఉపయోగించాలన్నారు. దీనిని తయారుచేసే విధానం గురించి ప్రయోగాత్మకంగా వివరించి రైతులకు మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలపై శక్తి టీంకు ఫిర్యాదు చేయండి



కైకలూరు: కాలేజీ, పాఠశాలల నుంచి వచ్చే బాలికలను ఎవరైనా ఆకతాయిలు అల్లరి చేస్తే శక్తి టీం సభ్యులకు, 112 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని కైకలూరు రూరల్ సర్కిల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల వద్ద శక్తి టీం కానిస్టేబుళ్లు మంగళవారం గస్తీ నిర్వహించారు. బాలబాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. శక్తి యాప్‌ను సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసే విధానాన్ని వివరించారు.

వ్యర్థాల వర్గీకరణపై శిక్షణ



గుడ్లవల్లేరులో శిక్షణ పొందిన నాలుగు మండలాల సీఆర్పీలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పంచాయతీ ఏరియాలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులోని తడి చెత్త, పొడి చెత్త సేకరణపై గుడ్లవల్లేరు, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాలకు సంబంధించిన ఎంపికైన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు గృహస్థాయి వ్యర్థాల వర్గీకరణపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. గృహస్థాయిలో తడి, పొడి వ్యర్థాలపై 100 శాతం అవగాహన కల్పించారు. మహిళల భాగస్వామ్యంతో లక్ష్య సాధన వంటి అంశాలపై శిక్షణ పొందిన ప్రతి సీఆర్పీకి తనకు కేటాయించిన వెయ్యి కుటుంబాలకు తడి, పొడి చెత్తను విడదీయు పద్ధతి నేర్పించారు. అక్టోబర్‌లో గౌరవ వేతనంగా రూ.5వేలతో పాటు ఫిబ్రవరి 2026లో మరొక రూ.5వేల నగదు ప్రోత్సాహకం వెరసి మొత్తం రూ.10 వేలు సీఆర్పీకి లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రతి విషయాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయండి



మొవ్వలో సూచనలిస్తున్న డెప్యూటీ స్టాటిస్టిక్స్ ఆఫీసర్

మొవ్వ: పంటకోత అంచనాలు, దిగుబడులు పక్కాగా, సకాలంలో నిర్వహించి, ప్రతి విషయాన్ని సీసీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డెప్యూటీ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ ఎస్‌టీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని 16 సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం మొవ్వలో నిర్వహించారు. అలాగే పంట కోత ప్రయోగం చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొవ్వ సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సూరపనేని శ్యామల, ఏఓ సురేష్‌బాబు నాయక్, ఏఎస్‌ఓ భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



వృద్ధులకు చీరలు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ నాయకులు

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని కర్ల ఫౌండేషన్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు కె. రామారావు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎల్‌ఈ వెంకటేశ్వరరావు, బి.కుటుంబరావు, ఎల్.చిట్టిబాబు, అర్జా ప్రసాదు, కె. రామకృష్ణ, వి.బ్రహ్మాజీ, కె. సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.50,708 విరాళం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు గుడివాడ విశ్వభారతి ఉపాధ్యాయ బృందం కాజ షర్మిల ద్వారా రూ.50,708 అందించారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందజేశారు. అలాగే అడుసుమిల్లి సత్య వరప్రసాద్ రూ.5,116 విరాళాన్ని అందించారు. నెప్రూరా పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ అడుసుమిల్లి సుబ్బయ్య, ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

మొవ్వ: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలని, ఈ విషయంలో పశుపోషకులు అధికారులకు సహకరించాలని మొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎంఎస్‌ఏ దివాకర్ సూచించారు. ఆయన మంగళవారం మొవ్వ తాలూకా పశువైద్యశాలలో 55 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిబ్బంది అజయ్, రవి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మంత్రిపాలెం(మొవ్వ): మొవ్వ మండలం మంత్రిపాలెంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. కూచిపూడి ఎస్ఐ కేవీఎస్ విశ్వనాథ్ కథనం మేరకు మంత్రిపాలెం గ్రామానికి చెందిన దోనేపూడి పిచ్చేశ్వరమ్మ ఈ నెల 10వ తేదీ ఉదయం తన ఇంటికి తాళం వేసి చల్లపల్లిలోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి ఈ నెల15వ తేదీ రాత్రి వచ్చింది. ఇంటికి వచ్చి చూడగా ఎవరో ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న ఐరన్ అల్మరాలో పెట్టిన నల్ల పూసల గొలుసులు(2 కాసులు), జత చెవి దిద్దులు (ముప్పావు కాసు)తోపాటు వెండి గ్లాసులు రెండు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ఆలయ భూముల కౌలు వేలం

గుడివాడ టౌన్: గుడివాడ రూరల్ మండలం తట్టివర్రులోని దేవదాయ, ధర్మాదాయ శాఖ భూముల కౌలు వేలం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎం.తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన తట్టివర్రు గ్రామంలో గల 5.86 ఎకరాల వ్యవసాయ భూమి మూడేళ్లపాటు కౌలుకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం మూడు గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద జరిగే ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 12 వేలు దరావత్తు చెల్లించి బహిరంగ వేలం ద్వారా కౌలు హక్కు పొందవచ్చని తెలిపారు.

నేడు హుండీ కానుకుల లెక్కింపు

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన గ్రామస్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: యువతి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వైవాక గ్రామానికి చెందిన ఓ యువతి ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల్లో డిగ్రీ ఫైనలీయర్ చదువుతోంది. ఈ నెల 15న వైవాకలోని ఇంటికి వచ్చి భోజనం చేసిన తరువాత నిద్రించింది. తెల్లవారేసరికి ఇంట్లో కనిపించకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీనిపై తండ్రి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎస్వీ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యూరియా సరఫరాపై ఆందోళన వద్దు

బల్లిపర్రు(పామర్రు): యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని బల్లిపర్రు, పెదమద్దాలి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. ప్రతి రైతు తమ పంటను నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడే వ్యవసాయశాఖ ద్వారా అమలు అయ్యే పథకాలు పొందగలుగుతారని తెలిపారు. వరిలో అవసరం మేరకు పురుగు ఉధృతిని బట్టి పురుగుమందులు వినియోగించాలన్నారు. ప్రస్తుతం అక్కడక్కడా వరిలో ఆకుముడత పురుగును గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ ఒక గ్రాము ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ శివనాగరాణి, బల్లిపర్రు గ్రామ సర్పంచ్ సుధాకర్, వీఏఏలు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల అభివృద్ధికి కృషి



ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: నియోజకవర్గంలో బీటీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే గృహంలో మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడివాడరూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.4.5కోట్లతో అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌అండ్‌డీ డీఈ జె.కామేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మున్సిపల్ ఎంఈ ప్రసాద్ పాల్గొన్నారు.

తొమ్మిది మంది చిన్నారులకు ఫిజియోథెరపీ



లోకుమూడి భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

మండవల్లి: లోకుమూడి భవిత సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన శిబిరంలో తొమ్మిది మంది చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ కె సునీత ఫిజియోథెరపీ సేవలు అందించారు. హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, వేణుబాబు మాట్లాడుతూ ఫిజియోథెరపీ అవసరమైన పిల్లలను ప్రతి మంగళవారం తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ పిల్లలను 10 నిముషాల పాటు సపోర్టుగా నిలబెట్టడం, నడిపించడం శ్రద్ధతో తల్లిదండ్రులు చేయాలన్నారు. ఐఈఆర్టీలు టి.అరుణకుమారి, వై.శిరీష, జి.శైలజ భవిత కేంద్రంలో సేవలు అందజేశారు.